నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో రబీలో ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేసిన వేరుశనగ విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు నష్టపోయారని, వారందరికీ పరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు అధికారులను కోరారు. ఈమేరకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు లేఖ రాశారు. వ్యవసాయశాఖ ద్వారా అందించిన వేరుశనగ విత్తనాలు అనేక ప్రాంతాలలో 70శాతం వరకు మొలకెత్తలేదని తెలిపారు. కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో సుమారు 700 బస్తాలు పంపిణీ చేసిన వేరుశెనగ విత్తనాలు మొలవక పోవటం, గింజ కుళ్లిపోవటం, కొవ్వురాళ్ళుతో ఇవ్వటం వల్ల వందలాదిమంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. ఈ విషయమై రైతులు స్పందనలో తెలియజేయడంతో ఎపిసీడ్స్, వ్యవసాయశాఖ అధికారులు కొన్ని పంటవేసిన పొలాలు పరిశీలించి సుమారు 50శాతం మొలిచినట్లు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మూడురోజుల్లో గడపగడపకు బిల్లులు

- ఫిర్యాదు దారులు శతశాతం సంతృప్తి చెందాలి
- ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను తనిఖీ చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను పూర్తిచేసి, అప్‌లోడ్ చేసిన మూడునాలుగు రోజుల్లోనే బిల్లుల జమ అవుతాయని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఫిర్యాదు దారులు శతశాతం సంతృప్తి చెందేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమంపై మండల, జిల్లా స్థాయి అధికారులంతా ప్రత్యేక శ్రద్ద చూపించాలని ఆదేశించారు.

శతశాతం సంతప్తి చెందేలా జెకెసి

మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, మండల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం (జెకెసి), నాడూ-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం, ఫ్యామిలీ ఫిజీషియన్, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్షించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులను పరిష్కరించే విధానంలో మార్పు రావాలని స్పష్టం చేశారు.

నెలాఖరుకు నాడూ-నేడు పూర్తి చేయాలి

నాడూ-నేడు రెండో దశ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, వాటికి నీటి సదుపాయం, కిచెన్ షెడ్లు, రిపేరు పనులను పూర్తిచేసి, పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. చాలాచోట్ల పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఎక్కడ తేడా జరిగినా, విద్యార్థులు అస్వస్థతకు గురైనా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

మూడు రోజుల్లోనే బిల్లుల చెల్లింపు

గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతా కార్యక్రమమని కలెక్టర్ స్పష్టం చేశారు. పనులు పూర్తి అయిన మూడునాలుగు రోజుల్లోనే బిల్లులు జమ అవుతున్నాయని, ఈ అవకాశాన్ని ప్రతీఒక్కరూ వినియోగించుకొని పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ సచివాలయానికీ రూ.20లక్షలు చొప్పున మంజూరయ్యిందని, ఈ నిధులను పూర్తిగా వినియోగించి పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు జరుగుతోందని, అయినప్పటికీ పనులు అంత వేగంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించిందని, దీనిపై మండల ప్రత్యేకాధికారులు దృష్టిపెట్టి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉపాధిహామీలో మొదటి స్థానాన్ని నిలబెట్టుకోవాలి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద పనిదినాల కల్పనలో దేశంలోనే మన జిల్లా మొదటి స్థానంలో నిలబెట్టినందుకు డ్వామా సిబ్బందిని, వేతనదారులను అభినందించారు. ఇచ్చిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధిస్తూ, ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేయాలని కోరారు. పథకం అమల్లో ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద చేపట్టిన కన్వర్జెన్సీ పనుల బిల్లలను రెండు రోజుల్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ మొదటి వారంలో బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, సిపిఒ బాలాజీ, జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కల్లేపల్లి డ్వాక్రా మహిళల ఆందోళన

- చెల్లించిన డబ్బులు బుక్ కీపర్ తినేశారని ఆవేదన
- వెలుగు అధికారుల నిలదీత
- ఎపిజివిబి మేనేజర్‌పై ఆగ్రహం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు అదే గ్రామంలో సోమవారం ఆందోళనకు దిగారు. వెలుగు బుక్కు కీపర్ గాడి చిన్నతల్లి మరో బుక్ కీపర్ గోకాడ మహేశ్వరిని చంపి జైలుకు వెళ్లిన సంగతి పాఠకులకు విధితమే. ఈ హత్యకు లావాదేవీలే కారణమని తెలుసుకున్న కొత్తవలస ఎపిజివిబి బ్యాంకు నుంచి డ్వాక్రా సంఘాలకు నోటీసులు అందిన సంగతి కూడా పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, కల్లేపల్లి సర్పంచ్ గోకాడ ముసలినాయుడు, తూర్పాటి అప్పలరాజు ఆధ్వర్యంలో వెలుగు అధికారులు సంఘ సభ్యులను విచారించారు. డబ్బులు చెల్లించినా నోటీసులు అందడంతో కోపోద్రుక్తులైన మహిళలు తొలుత అధికారులపై తిరగబడ్డారు. దీంతో కల్లేపల్లిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. స్త్రీనిధికి చెందిన డబ్బులు చిన్నతల్లి తనకు ఇవ్వలేదంటున్నారని డ్వాక్రా గ్రూపు సభ్యులు అన్నారు. ముఖ్యంగా రమాబాయి, అంబేద్కర్, బీమాభాయ్, ధనలక్ష్మి, వికాస్, తారకరామా తదితర గ్రూపులతో పాటు మరికొన్ని గ్రూపుల నుంచి చిన్నతల్లి భారీగా అక్రమాలకు పాల్పడిందంటూ సభ్యులు ఆరోపించారు. లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడిన ఈ బాగోతం వెనుక సిసి ఈశ్వరరావు, కొత్తవలస ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ హస్తం ఉన్నట్లు తారకరామా గ్రూపు సభ్యులు ఎర్ని కుమారి అధికారులకు తెలిపారు. గ్రూపు సభ్యులు ఇచ్చిన డబ్బులు బ్యాంకుకు చెల్లించకుండా చెల్లించినట్లు తప్పుడు రసీదులు చిన్నతల్లి ఇచ్చిందని బ్యాంకు స్టాంపు లేని రసీదులను చూపించారు. తాము ఎటువంటి రుణాలు తీసుకోకుండా రూ 3 లక్షల 40 వేల 280 చెల్లించమని బ్యాంకు నోటీస్ ఇచ్చారంటూ భీమాబాయి (2) గ్రూపు సభ్యులు గొల్ల అప్పలనరసమ్మ, బి.పెంటమ్మ తెలిపారు. ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్, అప్పటి వెలుగు సిసితో కుమ్మక్కయి తమ డబ్బులు తినేసారంటు మహిళలు మండిపడ్డారు. అనంతరం గ్రూపుల వారీగా ఎవరెవరికి ఎంత నష్టం వాటిల్లిందని డిపిఎం ఎల్‌హెచ్ ఏరియా కోఆర్డినేటర్ ఎం.జయశ్రీ, స్త్రీ నిధి ఎజిఎం ఎ.ఉమా మహేశ్వరరావు, డిపిఎం డియల్ బంగారమ్మ, ఎపిఎంలు అప్పలనాయుడు , సూర్యనారాయణ తదితరులు ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వకుండా అప్పు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసిన బ్రాంచ్ మేనేజర్ పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి సిసి, బ్రాంచ్ మేనేజర్, బుక్ కీపర్ చిన్నతల్లి ముగ్గురు కలిపి డ్వాక్రా సంఘాల డబ్బులు తినేసినట్లు డాక్రా మహిళలు చెబుతున్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

వినతులు పరిశీలించి సమాధానమివ్వాలి

స్పందనకు 188 వినతులు : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. స్పందనలో వచ్చిన వినతులు పరిశీలించి వారికి సమాధాన మివ్వాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో 188 వినతులు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, ఆర్‌డిఒ సూర్యకళ, డిఆర్‌ఒ గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుదర్శన దొర, సూర్యనారాయణ తదితరులు వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలకు చెందిన వినతులు అసంతృప్తి లో ఉన్నాయని, వాటికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రతి వారం గత వారం అందిన దరఖాస్తులపై సమీక్షిస్తున్నామని,గడువు లోగా పరిష్కారం కావడం తోపాటు సంతృప్తి శాతం పెరగడం కూడా ముఖ్యమని భావించాలన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎం.దీపిక, అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి, వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ జె.మురళి, స్పెషల్‌బ్రాంచి సిఐ జి.రాంబాబు, ఇ.నర్సింహమూర్తి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల సీనియారిటీ జాబితా విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన సీనియారిటీ ప్రొవిజినల్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. మొత్తం హెచ్‌ఎం గ్రేడ్-2..113 మంది, లాంగ్వేజ్ పండిట్ 15, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం 196, స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లీషు 264, హిందీ 176, తెలుగు 209, సంస్కృతం 3, బయోలజికల్‌సైన్స్ 226, లెక్కలు 318, పీడీ 104, ఫిజికల్‌సైన్సు 226, సోషల్ 256, ఎస్‌జిటిలు 2067 మంది జాబితాను సీనియారిటీ జాబితాలో ఉంచినట్లు పేర్కొన్నారు. మొత్తంగా దరఖాస్తు చేసుకున్న 4264 మంది సీనియారిటీ జాబితా ను విడుదల చేసినట్లు తెలిపారు.

అది మేనిఫెస్టో కాదు మాయా ఫెస్టో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి మహానాడులో ప్రకటించినది మేనిఫెస్టో కాదని, ప్రజలను మోసం చేసే మాయాఫెస్టో ఉత్తరాంధ్ర వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జ్ అవనాపు విక్రమ్ అన్నారు. 2014 ఎన్నికల్లో 600 పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు పట్టుమని 10 శాతం హామీలను కూడా నెరవేర్చలేదని గుర్తుచేశారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజలను దగా చేయడానికి చంద్రబాబు ఆరు అబద్ధాల హామీలను ప్రకటించారని ఆరోపించారు. చంద్రబాబును ప్రజలు ఖచ్చితంగా నమ్మరని అన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను, కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారని అన్నారు. ఏడాదికి రూ.20 వేలు రైతులకు ఇస్తానని ప్రకటిస్తే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి గతంలో కోటి 50 లక్షల కుటుంబాలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి వ్యక్తి నేడు 20 లక్షల ఉద్యోగులు ఇస్తానంటే యువత నమ్మే పరిస్థితి లేదని అన్నారు. డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి మోసం చేసింది చరిత్ర చంద్రబాబుదని ఎద్దేవా చేశారు.

నాటకంలో ఓ సన్నివేశం

రసవత్తరం.. ఘంటసాల జీవిత చరిత్ర నాటకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఘంటసాల స్మారక కళాపీఠం, శ్రీ సాయి సంతోషి నాట్య మండలి (సురభి) స్టేషన్ ఘనపూర్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి స్థానిక గురజాడ కళాభారతి వేదికపై ప్రదర్శించిన ఘంటసాల జీవిత చరిత్ర నాటకం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. ముందుగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నాలుగు ఎస్‌ల రాజు, భీశెట్టి బాబ్జీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మధురగాయకునికి నివాళిగా నిర్వహించిన ఈ నాటకం ప్రేక్షకాదరణ పొందింది. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, ధవళసర్వేశ్వరరావు తదితరుల ఘంటసాల జీవితంలో విశేషాలను వివరించారు. నాటకంలో అలనాటి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడిగా చేసిన సేవలు, సన్నివేశాలు, అలానే ఘంటసాల సినీ నేపథ్యగాయకుడిగా ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సన్నివేశాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమానికి ముందు భగవతీ నృత్య కళామందిర్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం కళాకారులను సత్కరించారు. అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, కార్యదర్శి దవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవివి సత్యనారాయణ, వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.భీష్మారావు, మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పలువురు కళాభిమానులుపాల్గొన్నారు.

డిసిఎంఎస్ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు

డిసిఎంఎస్ చైర్మన్ భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు డిసిఎంఎస ‾లో అందు బాటులో ఉన్నా యని చైర్‌పర్సన్ అవనాపు భావన ఒక ప్రకటన లో తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనుకు రైతులకు కావలసిన 1121 రకంతో పాటు సోనామసూరి, సాంబమసూరి, ఫౌండేషన్, మొక్కజొన్న విత్తనాలు (నాన్ సబ్సిడీ) ఈనెల 31 నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయనగరం డిసిఎంయస్ కార్యాలయం వద్ద, బొబ్బిలి డిసిఎంయస్ డిపోలో రైతులకు అవసరమైన నాణ్యమైన వరి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటు ధరలో లభిస్తాయని తెలిపారు. అన్ని రకాల ఎరువులు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ఏడాది విద్యార్థులకు లేపాక్షి నోట్‌బుక్స్ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నియంత పాలనపై యుద్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలకు పెత్తందార్లుకు మధ్య జరుగుతున్న యుద్ధం అంటూ, జగన్ ప్రభుత్వం చేస్తున్న వింత ప్రచారాన్ని దుయ్యబడుతూ సోమవారం విజయనగరం బాలాజీ జంక్షన్ వద్ద మన జనసేన పార్టీ ఆధ్వర్యంలో వినూత్న ప్రదర్శన చేపట్టారు. పాపం కసాయి వాడు, రక్త రచన, దౌర్జన్యపు నిర్వహణ, నరహంతక దర్శకత్వం జగన్ అంటూ వైసిపి ఫ్లెక్సీల పక్కనే జనసేన తరపున ఫ్లెక్సీలు పెట్టి, చుట్టూ పెత్తందార్లను పెట్టుకుని రౌడీ రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డి అతి పెద్ద పెత్తందారి అని నాయకులు ఈ సందర్భంగా అన్నారు. 2024లో పెత్తందారి జగన్‌కు, పేదల తరపున పోరాడుతున్న జనసేన పార్టీకి మధ్యనే యుద్ధమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మర్రాపు సురేష్ గారు, జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు , మిడతాన రవి కుమార్ , ఆదాడ మోహన్, మండల అధ్యక్షులు సంచాన గంగాధర్ , తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు

విజయనగరం : మిషన్‌లైఫ్ అమలులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన సోమవారం పాత బస్టాండ్ ప్రాంతంలో వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, చుట్టుపక్కల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ పర్యావరణహిత జీవనశైలి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మిషన్ లైఫ్‌పై ప్రతిజ్ఞ చేయించారు.

ఎన్‌సిసి విద్యార్థుల రక్తదానం

విజయనగరం : కోరుకొండ సైనిక్ స్కూల్లో ఈనెల 25 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తున్న ఎటిసి-4 ఎన్‌సిసి క్యాంపులో గర్ల్స్-బి ఎన్ సిసి ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛంద రక్తదానం చేశారు. 20 మంది విద్యార్థినులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎకె నౌటియల్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ ఎమ్.సత్యవేణి, సుబేదార్ మేజర్ రామ్‌దత్, సుబేదార్ మేజర్ డి.ఎస్.బౌడేల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.రాము పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువత

చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నిరసన ర్యాలీలు

ఆల్ ఫ్రీ బాబుతో తస్మాత్ జాగ్రత్త : జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

వైసిపి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చీపురుపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యాన భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గరివిడి పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి చీపురుపల్లి గాంధీ సెంటర్ వరకు జరిగిన బైక్ ర్యాలీలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌టిపిటిసిలు, ఎంపిపిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం చీపురుపల్లి గాంధీ సెంటర్ వద్ద కార్యకర్తలను ఉద్దేశించి జెడ్‌పి చైర్మన్ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయని చంద్రబాబునాయుడుకు వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో సుమారు 33 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే వాటిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సెంటు స్థలంలో శవాలు పూడ్చుకోవడానికి తప్ప ఏమి ఇల్లు సరిపోతుంది అనడాన్ని ఖండిస్తున్నామన్నారు. మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో చూస్తుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలు పేదవాడికి పెత్తందారులకి మధ్య జరిగే యుద్ధమని అన్నారు. ఎన్నికల సమయాల్లో చంద్రబాబు నాయుడు ఆల్ ఫ్రీ బాబుగా మారిపోతాడని, ఎన్నికలు అయ్యాక ప్రజలను మోసం చేస్తాడని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గుర్ల, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

నగరంలో భారీ ర్యాలీ

విజయనగరం టౌన్ : పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికతో పోల్చిన చంద్రబాబు తీరును ఖండిస్తూ వైసిపి ఆధ్వర్యాన సోమవారం నగరంలో భారీ ద్విచక్ర వాహన రాలీ చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా వైఎస్‌ఆర్ సర్కిల్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జి అల్లు చాణక్య మాట్లాడుతూ చంద్రబాబుకు మతిభ్రమించిందని, అధికారం కోసం పగటి కలలు కంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన కలలు కలలుగానే మిగిలిపోతాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సుమారు 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు, తెలుగుదేశం పార్టీ హయంలో అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్లను సైతం పూర్తి చేశారని గుర్తు చేశారు ఎన్నికల సమీపిస్తున్న వేళ మోసపూరిత హామీలతో అన్ని ఆల్ ఫ్రీ అంటూ మేనిఫెస్టోను విడుదల చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు, కార్పొరేటర్లు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఎన్ని కుతంత్రాలు చేసినా గెలిచేది వైసిపినే..

భోగాపురం : టిడిపి ఎన్ని కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైసిపినే విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనకు మద్దతుగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మహారాజుపేట జంక్షన్ నుండి పోలిపల్లి, సవరవల్లి, ఎ.రావివలస, భోగాపురం వరకు జాతీయ రహదారి సర్వీస్ రోడ్ వెంబడి ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చినా సంక్షేమ పథకాలు ఆపకుండా ముందుకు సాగిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని, టిడిపి ఎన్ని కుయుక్తులు చేసినా ప్రజలు నమ్మరన్నారు.

చీపురుపల్లి : ర్యాలీలో పాల్గొన్న వైసిపిజిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు

కార్యక్రమంలో హౌసింగ్, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్లు శివారెడ్డి, మైలపల్లి నరసింహులు, కర్రోతు వెంకటరమణ, శ్రీనివాసరావు, విజయభాస్కర్ రెడ్డి, పట్న తాతయ్యలు, వైస్ ఎంపిపి రావాడ బాబు, సూరాడ చిన్న, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

భోగాపురం : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నాయకులు, కార్యకర్తలు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- వీపురుపల్లి

ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీపురుపల్లి రోడ్లల్లో చిన్ని గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న కుటుంబాలకు సోమవారం వస్త్రాలను పంపిణీ చేశారు. మండలంలోని జి.అగ్రహారానికి చెందిన పీడీ ప్రసాద్ తన దగ్గర వున్న పాత వస్త్రాలను ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణకు అందజేశారు. వాటిని ఆయన రోడ్డు పక్కనే నివాసం ఉంటున్న పేదలకు అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మన ఇంట్లో వాడి పడేసేవిని వస్తువులను ఇలాంటి వాళ్లకు అందజేయాలన్నారు. అందరూ మానవత్వంతో ఆలోచించాలని కోరారు.

బట్టలు పంపిణీ చేస్తున్న రెడ్డి రమణ

రోడ్డుకు ఇరువైపులా బెర్మలు పూడ్చివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు 19 కిలోమీటర్లు పొడవునా రూ. 39 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి జగ్గయ్యపేట నుండి అరిగి పాలెం గ్రామ మధ్య రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన బెర్మలు కొట్టుకుపోయాయి. దీనిపై ప్రజాశక్తి పత్రికలో కథనం వెలువడటంతో కాంట్రాక్టర్ స్పందించి సోమవారం కూలిపోయిన బెర్మలను పూర్తిచేయడానికి అవసరమైన మట్టిని సిద్ధం చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెర్మలను పూడ్చేందుకు వేసిన ఎర్రమట్టి

వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల బిఆర్అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో అన్ని ముఖ్య పొరలు, డొంకలను వారం రోజుల్లోగా తొలగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ వసతి గృహం అభివృద్ధి కాకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వేపాడకు చెందిన సామాజిక కార్యకర్త సోమవారం కలెక్టరకు స్పందనలో ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆమె సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టరకు వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

31న రేషన్ బియ్యం వేలం

ప్రజాశక్తి - గజపతినగరం

ఈ నెల 31న రేషన్ బియ్యాన్ని వేలం వేస్తున్నట్లు సి.ఎస్.డి.టి డి.వి రవిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా అక్రమంగా తరలిస్తున్న 229.40 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేయటం జరిగిందని వాటిని బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్.ఎల్.ఎస్ పాయింట్ గజపతినగరం వద్ద వేలం వేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవాళ్లు ఈ వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

రేషన్ కోసం 8 కిలోమీటర్లు నడవాల్సిందేనా?

ప్రజాశక్తి - కురుపాం

రేషన్ బియ్యం కావాలంటే గిరిజనులు 8 కిలోమీటర్లు నడవాల్సిందే అని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజన సంఘం జిల్లా మహాసభల ప్రచార కోసం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ నాయుడుగూడకు సోమవారం ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి సమస్యను గిరిజనులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయుడుగూడలో గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయుడుగూడ నుండి ధర్మలక్ష్మీపురం మీదుగా 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న నీలకంఠాపురం గ్రామానికి రేషన్ బియ్యం కోసం కాలి నడకన వెళ్తున్నారని, నారాపోసాగా 16 కిలోమీటర్లు దూరం నడిచి గిరిజనులు బియ్యం తెచ్చుకుంటున్నారని తెలిపారు. వెళ్లిన రోజు వేలి ముద్రలు పడక పోతే రెండేసి, మూడేసి రోజులు తిరగాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. గతంలో జుంబిరిలో రేషన్ డిపో ఉండేదని దాన్ని నీలకంఠాపురానికి మార్చినప్పటి నుంచి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జుంబిరిలో డిపోను ఉంచాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించినప్పటికీ మార్పు చేయలేదని అన్నారు. కూలి పనులను విడిచిపెట్టి రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జుంబిరిలో డిపో అయిన ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆఫ్‌లైన్లోనైనా రేషన్ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డిక వెంకటరావు, నాగేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జూన్ 2నుంచి జరగబోయే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 1693 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉందని, వీరి కోసం 9 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని అన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు 13 మంది, పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 13 మంది జిల్లా అధికారులను నియమించినట్టు తెలిపారు. రూట్ అధికారులుగా నలుగుర్ని నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద శానిటేషన్ చేసి, బ్లీచింగ్‌ను చల్లాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. మంచి నీటిని ఏర్పాటు చేసి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు జేసీ సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను కోరారు. పరీక్షలు జరిగే కేంద్రాల రూట్లలో అదనంగా బస్సులను నియమించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఎటువంటి పొరబాటులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు బి.జగన్నాధరావు, స్వామినాయుడు, కె.శివరామ్, టివిఎస్ సుధాకర్, ఎం. గజపతిరావు, ఎం.రమణమ్మ, యం రాజేంద్ర ప్రసాద్, సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావిలో పడి గీతకార్మికుడు మృతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని నర్సంపేట పంచాయితీలో గల నేల బావిలో పడి కొత్తవలస మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు సిమ్మ ఈశ్వరరావు మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగాపురం గ్రామానికి చెందిన గీత కార్మికులు ఈశ్వరరావు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లోపించి తిరుగుతున్నాడు. ఈయన భార్య బంగారమ్మ పుట్టిల్లు అయిన రేగ పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి మూడు రోజుల కిందట వచ్చింది. ఈ క్రమంలో ఇదే ప్రాంతంలో మతిస్థిమితం లోపించి తిరుగుతున్న ఈశ్వరరావు ప్రమాదవశాత్తు ఆదివారం బావిలో పడ్డాడు. కుటుంబ సభ్యులు రాత్రి అంతా వెతికినప్పటికీ దొరకపోవడంతో వెనుతిరిగారు. సోమవారం విగతజీవిగా బావిలో కనిపించడంతో మృతుని భార్య బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

210 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపు కోట

పట్టణంలోని రైల్వే స్టేషన్‌కి వెళ్ళే రహదారిలో సోమవారం 210 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్స్‌యువి 500 నెంబరు గల కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో మాటు వేసి పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో పట్టుకున్నామని నిందులు కారు వదిలి పారిపోయారని అందులో 210 కేజీల గంజాయి లభ్యమైందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల 'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వావిలపాడు సచివాలయంలో సోమవారం వావిలపాడు, వీలుపర్తి, నల్లమిల్లి సచివాలయాలకు చెందిన వాలంటీర్ల సేవలకు గ్రామస్తులు పురస్కారాలు అందించారు. సర్పంచ్ బీల రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పాల్గొని మాట్లాడారు. వాలంటీర్లు మరిన్ని సేవలు అందించి ప్రజాధరణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు ముమ్ములూరి జగన్నాథం, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, నాయకులు బీల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట సచివాయం పరిధిలోని గొర్లిపేట, కొత్తపేట గ్రామ వాలంటీర్లకు సోమవారం సత్కారం చేశారు. ఎపి టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వాలంటీర్లకు సన్మానం చేశారు.

డెంకాడ: వాలంటీర్లు గ్రామాల్లో చేస్తున్న సేవలు మరువలేనివని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు తెలిపారు. మండలంలోని చొల్లంగిపేటలో గుణుపూరపేట, ఢీ కొల్లం, చెల్లంపేట, గునుపూర్ వాలంటీర్లకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ వాలంటీర్లు బాధ్యతతో పనిచేసి గ్రామానికే కాకుండా మండలానికి జిల్లాకి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం వాలంటీర్లను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తమ్మినాయుడు, జెడ్‌పిటిసి బద్దుకొండ లక్ష్మి, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి,

వేపాడ: వాలంటీర్లను సత్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

ఎస్‌కోట: వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

సర్పంచులు కోరాడ కనకరాజు, పైలు ముత్యాలరావు, అట్టాడ కృష్ణ, ఎంపిటిసి కిరణ్ కుమార్, నాయకులు కొత్తడి శ్రీనివాసరావు, డీలర్ రాజు, మహంతి నరసింగరావు, సురేష్, అప్పారావు, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని 13,14,15 వార్డులలో పని చేస్తున్న వాలంటీర్లను వార్డు సచివలయాల్లో సోమవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ సత్కరించారు. వాలంటీర్ల సేవలను కొనియాడారు. అర్హత ఉన్నవారికి సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.శ్రీలక్ష్మి, మున్సిపల్ ఆర్ఒ ప్రసాద్,పాల్గొన్నారు.

బొండపల్లి: గ్రామాలలో పని చేస్తున్న వాలంటీర్లు ప్రజల మన్ననను పొందాలని ఎంపిపి చల్ల చలం నాయుడు కోరారు. సోమవారం మండలంలో ముద్దూరు, బొండపల్లి పంచాయతిలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మునకాల పైడిపునాయుడు, బొండపల్లి ఈశ్వరరావు అధ్యక్షతన వాలంటీర్లకు వందనంలో భాగంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వేధావతి, హౌసింగ్ ఎఇ రామరాజు, ఎంపిటిసి బండారు శ్రీనువాస రావు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, గ్రామ కార్యదర్శి జి.శ్రీనువాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో లంచగొండి వ్యవస్థను రూపుమాపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని నిమ్మలపాలెం గ్రామ సచివాలయంలో సోమవారం నిమ్మలపాలెం, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామ పంచాయితీలకు చెందిన వాలంటీర్లను సత్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని గ్రామ వాలంటీర్ వ్యవస్థ వైపు ఇప్పుడు దేశం మొత్తం చూడడం మన రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, నిమ్మలపాలెం, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం సర్పంచులు కొట్యాడ శ్రీనివాసరావు, కోన దేముడు, ఎస్.గణేష్, ఆర్.పవన్ కుమార్, ఎంపిటిసి శివప్రసాద్, వార్డు మెంబర్లు, పంచాయితీ విస్తరణాధికారి ధర్మారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: వాలంటరీల ద్వారా రాష్ట్రంలో లంచాలు లేని వ్యవస్థ రూపొందిందని స్థానిక ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సోమవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో భర్తాపురం, పెద్దకండేపల్లి సచివాలయ పరిధిలో పెద్దకండేపల్లి, సంత గౌరమ్మపేట సచివాలయం పరిధిలో సంత గౌరమ్మపేట, వినాయక పల్లి, వీరనారాయణం సచివాలయం పరిధిలో వీరనారాయణం, వెంకటరమణ పేట, తిమిడి, కొత్తూరు తదితర సచివాలయాల పరిధిలో వాలంటీర్లకు సేవ పురస్కారావు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, స్థానిక సర్పంచ్ ఎమ్.సరోజిని, ఎంపిటిసి బోజంకి వెంకటలక్ష్మి, మాజీ ఎంపిటిసిలు బోజంకి గోవింద్ ఎమ్.సత్యనారాయణ, వేపాడ మండలం రామస్వామిపేట సర్పంచ్ శర్మ, స్థానిక మాజీ సర్పంచ్ సోంబాబు, నాయకులు రామునాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: వాలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపిపి వెంకటవాసుదేవరావు

మహిళా రెజ్లర్లపై కేంద్రం తీరు జుగుప్సాకరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

భారతదేశానికి క్రీడల్లో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్ల ఆందోళనలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి మోడీ పట్టించుకోకుండా వదిలేయడం తగదని ఎపి మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షులు మద్ది మాణిక్యం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలో మాట్లాడుతూ పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ సందర్భంగా మహిళల మహా పంచాయత్ పేరుతో ఆందోళనకు సిద్ధమైన రెజ్లర్లను అదుపులోకి తీసుకునే క్రమంలో ఢిల్లీ పోలీసులు వారిని ఈడ్చుకెళ్లి మరీ బస్సులో పడేయటాన్ని తప్పు బట్టారు. చాలాకాలంగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న వారు పార్లమెంటువైపు బయలుదేరేందుకు సిద్ధంకాగా పోలీసులు అడ్డుకుని రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, బజ్ రంగ్ పునియాలను బలవంతగా అదుపులోకి తీసుకునే తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. బ్రిజ్ భూషణ్ బిజెపి ఎంపి కాబట్టే రెజ్లర్లు చేస్తున్న లైంగిక ఆరోపణలపై కేసు నమోదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. ఇక ప్రజాస్వామ్యం గురించి శుద్దులు చెప్పే బిజెపి రెజ్లర్ల ఆరోపణలపై తోటి ఎంపికి మద్దతుగా నిలుస్తున్నారనడం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రపంచంలోని పలు దేశాల క్రీడాకారులు, దేశంలోని క్రీడాకారులు రెజ్లర్లకు మద్దతుగా నిలుస్తున్నా ఎంపి బ్రిజ్ భూషణ్ పై చర్యలు శూన్యమని, ఇది దేశానికి పతకాలు సాధించిన క్రీడాకారులకు బిజెపి ఇస్తున్న విలువ అని ఎద్దేవా చేశారు. అదే ఇతర పార్టీలకు చెందిన ఎంపీలయితే బెయిలు కూడా రానీయకుండా కేంద్ర ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టేదని విమర్శించారు. ఇప్పటికైనా బిజెపి పెద్దలు పంతానికి పోకుండా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు గురి చేసిన ఎంపి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి దేశ ప్రతిష్టను ఇనుమడింప జేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ చాంద్ బీబీ, ఆదిమూలం పార్వతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

1800 ఎకరాల్లో వరి సాగు

ప్రజాశక్తి - భోగాపురం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళికతో మండలంలోని 1800 ఎకరాలలో వరి సాగు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని ఎఒ వి. హరికృష్ణ తెలిపారు. 100 ఎకరాల్లో వేరుశెనగ, మరో 100 ఎకరాల్లో మిగతా పంటలు సాగవుతున్నాయని తెలిపారు. వరి విత్తనాలు 1120, ఎంటియు సాంబ మసూరి 800 క్వింటాళ్ల వరకు కేటాయింపులు చేస్తున్నామన్నారు. 11 రైతు భరోసా కేంద్రాలలో 50శాతం రాయితీపై పచ్చరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 350 మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధం చేశామని అందులో యూరియా 200 టన్నులు, డిఎపి 100 టన్నులు, పొటాషియం 50 టన్నులు రైతులకు అందిస్తామన్నారు. ప్రతి రైతు ఖరీఫ్ పంటకు సంబంధించి ఈక్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ కూడా 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. కౌలుకు చేసిన రైతులకు కౌలుదారు పత్రాలు అందజేస్తామని తెలిపారు. కౌలు పత్రాల కోసం సర్వేనెంబర్, ఖాతా నెంబర్, ఆధార్‌తో ఆర్‌బికె ల్లో కలవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు జిలుగ, కట్టిజనుమ, పిల్లి పెసర విత్తనాలు వరిసాగు కు ముందు పొలాల్లో వేసుకుంటే నేల సారవంతమవుతుందని తెలిపారు. ఖరీఫ్ కోసం ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తామని, మండలంలో సాగు విస్తీర్ణం కూడా చాలా తక్కువ అని తెలిపారు.

ఎఒ హరికృష్ణ

రవాణా ఛార్జీలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- బొబ్బిలి

దాన్యం కొనుగోలు కేంద్రాలకు దాన్యం ఇచ్చిన రైతులకు రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. హమాలీ, రవాణా చార్జీలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021-22 ఖరీఫ్‌లో దాన్యం కొనుగోలు కేంద్రాలకు దాన్యం తరలించిన రైతులు సొంతంగా రవాణా, హమాలీ చార్జీలు భరించి దాన్యం తరలించారన్నారు. రైతులకు ప్రభుత్వం నేరుగా ఆయా చార్జీలను చెల్లిస్తుందని ప్రకటించిన ఇప్పటి వరకూ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రైతులకు చెల్లించాల్సిన రవాణా, హమాలీల చార్జీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అధికార పార్టీకి చెందిన నేతలు రైతులకు చెల్లించకుండా ఏజెన్సీల పేర్లతో మింగేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. హమాలీ, రవాణా చార్జీలు రైతులు బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఆర్డిఒ శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ. సురేష్, దాన్యం రైతులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కొత్త గొంగుపుడి గ్రామానికి చెందిన రైతులు తమ జీవనోపాధి పోతుందంటూ తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం... పెందుర్తి నుండి బొడ్డవర వరకు వస్తున్న జాతీయ రహదారి కారణంగా గంగుపూడి రెవెన్యూ సర్వేనెంబర్ 59 లో తమ పంట పొలాలు పోతున్నాయని రైతులు పేర్కొన్నారు. తమకు ఏ ఉద్యోగాలు లేకపోవడంతో తాత ముత్తాతల నుండి అదే పొలాలపై ఆధారపడి బతుకుతున్నామని తెలిపారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని సుమారు పది కుటుంబాలకు చెందిన రైతులు కోరారు.

బంద ఆక్రమణ తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని తారకరామ కాలనీకు అనుసరించి ఉన్న కోటగిరి వారిబంద ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఆక్రమణలో కోటగిరివారిబంద, బంద అక్రమణలో వైసిపి హస్తం కథనాలు వరుసగా ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. బందలో అక్రమంగా నిర్మించిన పునాదులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించడంతో టిపిఒ వరప్రసాద్ జెసిబి సహాయంతో బందలో నిర్మించిన పునాదులను సోమవారం తొలగించారు. ఆక్రమణలను తొలగించాలని రిటైర్డ్ వ్యాయమ ఉపాధ్యాయులు కోటగిరి నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అధికారులను కోరిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆక్రమణలు తొలగింపుతో నర్సింగరావు, శంకరరావు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలను జెసిబితో తొలగిస్తున్న సిబ్బంది

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాజమహేంద్రవరం మహనాడులో చంద్రబాబు మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా టిడిపి మహిళా నేతలు చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సోమవారం స్థానిక రామ తీర్థం జంక్షన్‌లో టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, జిల్లా మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి ఆధ్వర్యంలో మహిళా నేతలు క్షీరాభిషేకం చేశారు. జిల్లా మహిళా అధ్యక్షులు వనజాక్షి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో మహిళలకు పెద్ద పీట వేయడం అభినందనీయమన్నారు. మహిళా లోకమంతా వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబుని అధికారంలోకి తీసుకు రావడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, టిడిపి కౌన్సిలర్లు లెంక హైమావతి, కింతాడ కళావతి, నరవ రామలక్ష్మి, ముడుమంచి లక్ష్మి, మహిళా నాయకులు పొట్నూరు కృష్ణవేణి, అవనాపు రవణమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శారదకు లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రపంచ మానవ హక్కుల సంఘం లైఫ్ ఎచీవ్ మెంట్‌కు అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్, మానవ హక్కుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు చింతా శారద ఎంపికయ్యారు. లక్నోలో జరిగిన మానవ హక్కుల సంఘం జాతీయ వార్షిక సమావేశాల్లో అవార్డును శారదకు ఉత్తరప్రదేశ్ మంత్రి డేనిష్ ఆజాద్ అన్సారీ అందజేశారు. సేవలను గుర్తించి అవార్డు రావడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. మరింత బాధ్యతగా పని చేస్తామన్నారు.

అవార్డు అందుకుంటున్న శారద

జరజాపుపేట శ్మశానం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతి పరిధి జరజాపుపేట శ్మశానం అభివృద్ధికి దాతలు విరాళం ప్రకటించారు. సోమవారం గ్రామ పెద్దల సమక్షంలో గ్రామానికి చెందిన కీర్తి శేషులు నల్లి సత్యనారాయణ కుమారులు, కుటుంబ సభ్యులు తండ్రి పేరిట శ్మశానంలో రూ. 40వేలతో షెడ్ నిర్మాణం చేయడానికి ప్రకటించారు. కనకల ముత్యాల నాయుడు తన తండ్రి పేరిట అదే షెడ్ స్లాబ్ వేసేందుకు పిక్కను విరాళంగా ప్రకటించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శ్మశానం అభివృద్ధికి నోచుకోకుండా పోయిందని వర్షాల సమయంలో శ్మశానంలో వసతి సౌకర్యాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించడం హర్షణీయమన్నారు. గ్రామస్థులు కూడా తలో చెయ్యి వేసి శ్మశానం అభివృద్ధికి సహకరించాలని గ్రామ పెద్దలు కోరారు.

నేపాల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో పతకాలు

ప్రజాశక్తి - కొత్తవలస

ఐదవ నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో కె. సోహన్ దీక్షిత్, ఈ.పవన్, కె.నిహల్ రోషన్ (గోల్డ్,బ్రాంజ్) పతకాలు సాధించారు. కె.కర్తేయవిషల్ (గోల్డ్, రజితం) పి. రోహిత్ సై కృష్ణ, శ్రావణ కుమార్ బ్రాంచ్ మెడల్స్ సాధించారు. సుశ్రిత్ రోషన్, కర్రి లక్ష్మి దీపక్‌లు సిల్వర్, బ్రాంచ్ మెడల్ సాధించారు. వీరిని కోచ్ సూర్య నూకరాజు అభినందించారు.

శృంగవరపుకోట: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్థాయిలో విజయవాడలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ఎస్‌కోటకు చెందిన ముగ్గురు బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో ఐదు రాష్ట్రాలకు చెందిన అనేక మంది వాసవియాన్లు పాల్గొని తలబడగా ఎస్‌కోటకు చెందిన వాసవి క్లబ్ ఎస్.కోట మెగా నుండి రేపాక వీర శంకర్, వాసవి క్లబ్ వనిత, కొల్లా పుష్పారాణి గోల్డ్ మెడల్ సాధించారు. వీరిని అంతర్జాతీయ అధ్యక్షులు వాసవియన్ పాలకుర్తి గాయత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ వాసవియన్ గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ ఆత్మకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

సర్వేను ప్రారంభిస్తున్న శివారెడ్డి

ఎ.రావివలసలో రీభూసర్వే

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస గ్రామ రెవెన్యూకు సంబంధించి రీ-సర్వేను మండల సర్వేయర్ మధుసూదన రావు ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి సోమవారం ప్రారంభించారు. డ్రోన్ ఎగరవేసి బౌండరీ సర్వే చేపట్టారు. సర్వే పూర్తి అయితే గ్రామంలో పలు భూ సమస్యలు తీరుతాయని సర్పంచ్ శివారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ సతీష్, కో-ఆపరేటర్ దేవుడు బాబు, సర్వేయర్ కుమార్, విఆర్ఒ ప్రసన్న, పంచాయతీ సెక్రెటరీ స్వర్ణ, మహిళా పోలీసు రీనాపాల్, ఉప సర్పంచ్ నడుపూరు సత్యనారాయణ నాయుడు, కొండపు రమణ, దిండి భాస్కరరావు, బోర నాగరాజు, దువ్వు రాము పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు రూ.18వేలు వేతనమివ్వాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

పంచాయతీ కార్మికులకు జిఒలో పేర్కొన్న కనీస వేతనం రూ.18వేలు ప్రతీ నెలా 5వ తేదీ లోపు చెల్లించే ఏర్పాట్లు చేయాలని స్థానిక సిఐటియు నాయకులు బలస శ్రీను డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ రమామణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం కార్మికులు అందరికీ సమానంగా చెల్లించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రమాద భీమా రూ.20 లక్షల వరకు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో వారిపై వేధింపులు తగ్గించాలని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో భవానీ, శ్యామల, శ్రీనివాస రావు, కనక రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని ఇస్తున్న బలస శ్రీను

CHANGE OF NAME

I, SAI DIVYA SREE (Old Name), W/o Ramesh Puruganti, Resident of 1-238, Brahmain Street, Perapuram, Pusapatirega, Vizianagaram, A.P-535204. Changing my name from **PURUGANTI SAI DIVYA SREE (Old Name)** to **PURUGANTI VENKATA VIJAYA SAI DIVYA SREE (New Name)** Shall hence forth i will be called **PURUGANTI VENKATA VIJAYA SAI DIVYA SREE (New Name),** W/o. Ramesh Puruganti.

In the Honourable Court of the Additional Junior Civil Judge Parvatipuram
E.P. 20/2022 in O.S. 80/2019

Between:
Vruddhula Seshagiri Rao ....D.Hr
And:
Smt. Nadimpalli Aruna Kumari and others ...J.Drs
To,
1. Smt. Nadimpilli Arunakumari, W/o late Sambamurthy Raju, H.No. 199, MIG-3, VUDA colony Phase-3, Vizianagaram
2. Naidmpilli Ramakrishna Raju, S/o late Sambamurthy Raju, H.No. 199, MIG-3, VUDA colony Phase-3, Vizianagaram
3. Nadimpilli Vamsikrishna Raju, S/o late Sambamurthy Raju, H.No. 199, MIG-3, VUDA colony Phase-3, Vizianagaram
4. Naidmpilli Muralikrishna S/o late Sambamurthy Raju, H.No. 199, MIG-3, VUDA colony Phase-3, Vizianagaram.

Take notice that the above Execution Petition filed against you for recovery of the E.P., amount has been posted to **15.06.2023** for your appearance in the above court at **10.30 am**

Take notice that if you fail to attend the court on the day above mentioned the E.P., will be heard and determined in your absence exparte.

// By order of the Court//

P.Rajeswara Rao
Advocate
Vivek Colony, Belagam
PARVATIPURAM

Parvatipuram
Dt. 29.05.2023